

# ప్రజా రిపబ్లిక్

ప్రతి అక్షరం ప్రజల కోసం

RNI No:/2023/87888

పేజీలు : 4 సంపుటి : 01 - సంచిక 168 ఆంధ్ర ప్రదేశ్ , తెలంగాణ శుక్రవారం 20- 9 - 2024 వెల - 2

Digital Edition




**వైసీపీలో త్యాగాలు చేసిన వారికి న్యాయం జరగలేదు: బాలినేని**

**జనసేన కార్యాలయంలో ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను భేటీ అయ్యారు.**

**దాదాపు గంటపాటు ఇరువురు నేతల మధ్య చర్చ జరిగింది.**

**ఈనెల 22న జనసేనలో చేరుతున్నట్లు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, ఉదయభాను ప్రకటించారు.**

# డేట్ ఫిక్స్




**అమరావతి:** మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్‌రెడ్డికి విశ్వసనీయత లేదని మాజీమంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి సంచలన విమర్శలు చేశారు. వైసీపీలో త్యాగాలు చేసిన వారికి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జగన్‌ను గెలిపించాలని ఆనాడు రాజీనామాలు చేశామని గుర్తుచేశారు. ఇచ్చిన మాటను జగన్‌రెడ్డి మరిచిపోయారని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ధ్వజమెత్తారు.

**పవన్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధం..**

సభల్లో జగన్ ఎప్పుడూ తన గురించి మాట్లాడలేదని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి వాపోయారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడూ పవన్ కళ్యాణ్ తన గురించి మాట్లాడారని ప్రశంసించారు. తనపై పవన్ ఎంతో అభిమానంతో ఉన్నారని కొనియాడారు. పవన్‌తో కలిసి పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టంచేశారు. తనతోపాటు కార్పొరేటర్లు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు కలిసి జనసేనలో చేరుతారని బాలినేని శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు.జగన్ మనస్తత్వం అందరూ తెలుసుకోవాలి

"పవన్ కళ్యాణ్‌తో భేటీ తర్వాత జనసేనలో చేరాలని నిర్ణయించుకున్నాను. ఒంగోలులో సభ ఏర్పాటు చేసి అక్కడ జనసేన కండువా కప్పుకుంటాను. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు నాతో జనసేనలోకి వస్తారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్‌లో పనిచేశాను. నా మీద నమ్మకంతో నాకు వైఎస్ రాజకీయ భిక్ష పెట్టారు. ఆరోజు జగన్‌తో కలిసి నడిచాం. నేను, 17మంది నేతలు కాంగ్రెస్‌కు రాజీనామా చేశాం. జగన్ ఎదగాలని మేము అప్పుడు ఉప ఎన్నికల్లో గెలిచి ప్రతిపక్షంలో ఉన్నాం. మా డబ్బులతో గెలిచి జగన్ వెంట నడిచాం. జీవితాంతం నా గుండెల్లో ఉంటారని జగన్ చెప్పారు. ఈ 17 మందిని వదలకుండా అండగా ఉంటాం అన్నారు. విశ్వసనీయత అని పదే పదే చెప్పే నువ్వు ఈ 17 మందిలో ఒక్కరినైనా మంత్రిని చేశావా. జగన్ మనస్తత్వం అందరూ తెలుసుకోవాలి. వైఎస్ మీద అభిమానంతో ఎన్ని ఇబ్బందులు వచ్చినా వైసీపీలో కొనసాగాను" అని మాజీమంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.నాకు

**పదవులు ముఖ్యం కాదు..**

"ఎన్నికల సమయంలో కమ్యూనికేషన్ గ్యాప్ వల్ల జనసేనలోకి రాలేదు. నాకు పదవులు ముఖ్యం కాదు.. గౌరవం ముఖ్యం. పవన్ కళ్యాణ్‌కు ఇదే విషయాన్ని చెప్పి పార్టీ లోకి వస్తున్నా.

2లో

## పార్టీ కీలక నేతలతో జగన్ అత్యవసర సమావేశం..



**పార్టీలో తాజా పరిస్థితులపై ప్రధానంగా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.**

పార్టీ నేతలంతా ఒక్కొక్కరిగా దూరం అవుతుండటంతో వైసీపీ అధిష్టానం అప్రమత్తమైంది. కీలక నేతలతో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి భేటీ అయ్యారు. వైవీ సుబ్బారెడ్డితో పాటు కీలక నేతలతో తాడేపల్లి క్యాంప్ ఆఫీస్ లో జగన్ సమావేశం అయ్యారు. నేతలు పార్టీ వీడటంపై చర్చిస్తున్నారు.

బాలినేని రాజీనామా అంశంతో పాటు టీటీడీ లడ్డూ ప్రసాదం వివాదంపై డిస్కస్ చేస్తున్నారు. ఇప్పటికే బాలినేని వైసీపీకి రాజీనామా ప్రకటించగా, మరో మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను కూడా పార్టీ వీడేందుకు సిద్ధమయ్యారు. వీరిద్దరూ జనసేనలో చేరేందుకు ముహూర్తం కూడా ఖరారు చేసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో పార్టీలో తాజా పరిస్థితులపై ప్రధానంగా చర్చ జరుగుతున్నట్లు తెలుస్తోంది.

బాలినేని శ్రీనివాస్ రెడ్డి, సామినేని ఉదయభానుల వ్యవహారం వైసీపీలో కలకలం రేపింది. దీనిపై చర్చించేందుకు పార్టీ కీలక నేతలతో సమావేశమయ్యారు జగన్. వైవీ సుబ్బారెడ్డి, సజ్జల రామకృష్ణారెడ్డి, ఇతర ముఖ్య నేతలు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ముఖ్యంగా బాలినేని రాజీనామా తర్వాత తీసుకోవాల్సిన చర్యలపై చర్చిస్తున్నారు. ఒంగోలు జిల్లాలోని వైసీపీ క్యాడర్, ద్వితీయ శ్రేణి నేతలు, కార్పొరేటర్లు, మాజీ ఎమ్మెల్యేలు.. వీరంతా బాలినేని వెంట వెళ్తారని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో వారందరిని కంట్రోల్ చేసే బాధ్యతను వైవీ సుబ్బారెడ్డికి జగన్ అప్పగించే అవకాశం ఉంది.

ఒంగోలులో పార్టీని, కేడర్ ని, నేతలను ఏ విధంగా కాపాడుకోవాలి అనేదానికి సంబంధించి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు జగన్. ఇప్పటికే కార్పొరేటర్లు 20 మంది బాలినేని వెంట వెళ్తామంటున్నారు. మిగిలిన నియోజకవర్గాలకు సంబంధించిన మాజీ ఎమ్మెల్యేలు ఎవరూ

-మిగతా2లో

## చెక్కులను సీఎం చంద్రబాబు నాయుడు గారికి అందజేసిన మంత్రి

**రెండో విడతలో భాగంగా**




**అమరావతి సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్):**

నంద్యాల జిల్లాలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అందించిన చెక్కులను ఈరోజు ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబు నాయుడు గారికి అందజేయడం జరిగింది మంత్రి ఫరూక్ తెలియజేశారు

ఈ సందర్భంగా మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ విజయవాడ వరద బాధితుల కోసం వారిని ఆదుకోవాలని పిలుపునివ్వడంతో నంద్యాల ప్రజలు ముందుకొచ్చి వారి వంతు ఆర్థిక సహాయాన్ని చెక్కు రూపంలో అందజేయడం జరిగిందని ఆ చెక్కులను మొదటి విడతలో మంత్రి నారా లోకేష్ అందించడం జరిగిందని అలాగే రెండో విడతలో ఈరోజు సీఎం చంద్రబాబు నాయుడు చెక్కులను ఇవ్వడం జరిగిందని మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ తెలియజేశారు

వరద బాధితులను ఆదుకోవడంలో ముందుకొచ్చిన వారందరికీ మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలియజేశారు . అలాగే ఇంకా ప్రజలు ముందుకు వచ్చి వరద బాధితులను ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలియజేశారు

## మంచి మనసు చాటుకున్న కుమారీ ఆంటీ.. వరద బాధితులకు విరాళం..



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రెండు తెలుగు రాష్ట్రాలు అతలాకుతలమయ్యాయి. తెలంగాణలోని ఖమ్మం, ఏపీలోని విజయవాడ ప్రాంతాలు పూర్తిగా నీట మునిగాయి. ఈ నేపథ్యంలో ముంపు బాధితులను ఆదుకునేందుకు రెండు ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకుంటున్నాయి. అలాగే వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు కూడా వరద బాధితులను ఆదుకునేందుకు ముందుకొచ్చారు. తాజాగా కుమారి అంటీ ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.50వేలు విరాళం అందజేశారు. బుధవారం (సెప్టెంబర్ 18) కుమారీ ఆంటీ తన కుమార్తెతో కలిసి సీఎం రేవంత్ రెడ్డికి రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి కుమారీ ఆంటీని ఘనంగా సన్మానించారు. ఆమెకు శాలువా కప్పి ధన్యవాదాలు తెలిపారు. కాగా కొన్ని నెలల క్రితం ట్రాఫిక్ క్లియరెన్స్ లో భాగంగా కుమారీ ఆంటీ ఫుడ్ స్టాల్ ను పోలీసులు తొలగించారు. దీంతో ఆమె హోటల్ బిజినెస్ బాగా దెబ్బతింది. అయితే సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా జోక్యం చేసుకుని మరీ కుమారీ ఆంటీ ఫుడ్ హోటల్ ను ఓపెన్ చేయించారు.

కుమారి ఆంటీ పూర్తి పేరు దాసరి సాయి కుమారి. హైదరాబాద్‌లోని ఇనార్బిట్ మాల్ సమీపంలో రోడ్ సైడ్ మీల్స్ బిజినెస్ చేస్తోన్న ఆమె పేరు గత కొన్ని రోజులుగా బాగా వినిపిస్తోంది. 'మీది రూ.1000 అయింది..రెండు లివర్లు ఎక్స్?ట్రా అంటూ కుమారీ ఆంటీ చెప్పిన డైలాగ్స్ సోషల్ మీడియాలో బాగా వైరలైపోయాయి. దీంతో ఆమె ఫుడ్ స్టాల్ ముందు జనం క్యూ కట్టారు. ఫలితంగా ట్రాఫిక్ సమస్యలు తలెత్తి, పోలీసులు రంగ ప్రవేశం చేసి కుమారీ ఆంటీ హోటల్ ను క్లోజ్ చేయించాల్సి వచ్చింది.

## మౌనవ్రతంలో మాజీ ముఖ్యమంత్రి..!



ఆయన మాట్లాడినా సంచలనమే, మాట్లాడకున్నా సంచలనమే. అసలు, ఆయన మౌనమే ఓ భారీ కార్యాచరణను తలపిస్తుంది. మరి తెలంగాణలో రాజకీయం రణరంగాన్ని తలపిస్తుంటే.. ఆయన ఎందుకు మాట్లాడట్లేదు..? రాష్ట్ర సాధకుడిగా పేరొందిన వ్యక్తి.. ఇప్పుడెందుకిలా మౌనమునిగా మారిపోయారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ గురించి.. పార్టీ వర్గాల్లోనే కాదు, యావత్ తెలంగాణ ప్రజానీకంలో జరుగుతున్న చర్చ ఇది. ఇంతకీ ఆయన సైలెన్స్ దేనికి సంకేతం?

**అందరికీ రాజకీయాలంటే గేమ్ కావొచ్చు..! కేసీఆర్ మాత్రం**

రాజకీయమంటే ఒక టాస్క్. ఈ మాటలు గతంలో స్వయంగా కేసీఆర్ చెప్పినవే. కేవలం మాటలు కాదు రాజకీయాల విషయంలో ఆయన చేతలు కూడా అలానే ఉంటాయి. ఉద్యమ సమయం నుంచి మొన్నటి దాకా ఆయన రాజకీయ చాణక్యం అలానే ఉండేది. ప్రత్యర్థులకు అంతుచిక్కని పదునైన వ్యూహాలతో రాజకీయ దురంధరుడిగా పేరు గడించారు. 14ఏళ్ల ఉద్యమం నడిపి, తెలంగాణను సాధించి.. పదేళ్ల పాటు రాష్ట్రాన్ని పాలించిన కేసీఆర్.. మొన్నటి ఎన్నికల్లో అనూహ్యంగా ఓటమి చెందారు.

**అసెంబ్లీ ఎన్నికల ఓటమి తర్వాత..**

తుంటి ఎముకకు గాయం కావడం ఆయన్ని మరింత నీరసించేలా చేసింది. ఎంపీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నా ఇటీవల అసెంబ్లీ బడ్జెట్ సెషన్‌కు తొలిరోజు హాజరైనా ఆయన మునుపటిలా యాక్టివ్‌గా లేరు. తన వ్యవసాయ క్షేత్రంలోనే సేద తీరుతున్న కేసీఆర్, అడపాదడపా పార్టీ నేతలను కలుస్తున్నారు. కానీ, రాజకీయంగా ఆయన బయటకు వచ్చి చాలా రోజులైంది. ఇప్పుడిదే అంశం.. గులాబీ శ్రేణులను, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు నిరుత్సాహపరుస్తోంది.

ఇన్నాళ్లూ ఎలా ఉన్నా ఇప్పుడు తెలంగాణ రాజకీయం మరోసారి రగులుతోంది. అధికారపక్షంతో నువ్వా? నేనా?

-మిగతా2లో

## నెల్లూరులో వైసీపీకి బిగ్‌షాక్.. టీడీపీలోకి క్యూకట్టిన నేతలు



నెల్లూరు జిల్లాలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. ఆ పార్టీకి చెందిన 15 మంది కార్పొరేటర్లు, నుడా మాజీ చైర్మన్ టీడీపీలో చేరారు. వీరితోపాటు మరో 50మంది వైసీపీ నేతలు టీడీపీ కండువా కప్పుకున్నారు. మంత్రి నారాయణ ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన వారికి ఉండవల్లి నివాసంలో మంత్రి నారా లోకేశ్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

**టీడీపీలో చేరిన కార్పొరేటర్లలో..** 3వ వార్డు కార్పోరేటర్ సంక్రాంతి అశ్విని, 4వ వార్డు కార్పోరేటర్ పి.ప్రత్యూష, 5వ వార్డు కార్పోరేటర్ ఓ.రవిచంద్ర, 6వ వార్డు కార్పోరేటర్ ఎమ్.మస్తానమ్మ, 9వ వార్డు కార్పోరేటర్ దామవరపు రాజశేఖర్, 10వ వార్డు కార్పోరేటర్ కిన్నెర ప్రేమ్ కుమార్, 11వ వార్డు కార్పోరేటర్ గోతం అరుణ, 14వ వార్డు కార్పోరేటర్ కర్తం ప్రతాప్ రెడ్డి, 15వ వార్డు కార్పోరేటర్ జి.వెంకటేశ్వర్ రెడ్డి, 16వ వార్డు కార్పోరేటర్ వి.శ్రీకాంత్ రెడ్డి, 47వ వార్డు కార్పోరేటర్ పొట్లూరు రామకృష్ణ, 48వ వార్డు కార్పోరేటర్ షేక్ ఇంతియాజ్, 49వ వార్డు కార్పోరేటర్ వి.రాజేశ్వరి, 51వ వార్డు కార్పోరేటర్ కాయల సాహిత్య, 54వ వార్డు కార్పోరేటర్ షేక్ సఫియా బేగం, కో-ఆప్షన్ మెంబర్ షేక్ జమీర్ టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు.

## 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు



కేంద్ర మంత్రివర్గం ఏకకాల ఎన్నికలకు ఆమోదం తెలపడం అభినందనీయమైన కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. దీని వల్ల ఖర్చును ఆదా చేయడంతోపాటు దేశాభివృద్ధి మెరుగుపరుస్తుందన్నారు. 'ఒకే దేశం-ఒకే ఎన్నికలు' ప్రతిపాదనకు కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని

2లో

## ‘ఒకే దేశం-ఒకే ఎన్నికలు

కమిటీ మార్చిలో లోక్‌సభ ఎన్నికల ప్రకటనకు ముందు నివేదికను సమర్పించింది. దీనిపై మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.

ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల డబ్బుతోపాటు వనరులను ఆదా చేయడం, అభివృద్ధి, సామాజిక ఐక్యతను ప్రోత్సహించినట్లు అవుతుందన్నారు భారతదేశ ఆకాంక్షలను సాకారం చేయడంలో ప్రజాస్వామ్య పునాదిని బలోపేతం చేయడానికి సహాయపడుతుందని పేర్కొన్నారు. ఏకకాల ఎన్నికలు మోడల్ ప్రవర్తనా నియమావళి విధించడం వల్ల విధాన పక్షవాతం కారణంగా అభివృద్ధి పనులకు అంతరాయం కలిగించడమే కాకుండా, ఎన్నికల సమయంలో మోహరించిన కీలకమైన సిబ్బందిపై ఓటరు అలసత్వం, భారానికి దారితీస్తుందని అభిప్రాయపడ్డారు. ఏకకాల ఎన్నికలతో పోల్చితే దాదాపు 1.5 శాతం ఎక్కువ వాస్తవ జాతీయ వృద్ధి సాధ్యమవుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. ఏకకాల ఎన్నికల సమయంలో ద్రవ్యోల్బణం తగ్గుదల ఎక్కువగా ఉంటుంది. ద్రవ్యోల్బణంలో 1.1 శాతం పెద్ద పతనం ఉంటుందని కిషన్ రెడ్డి అంచనా వేశారు. విడివిడిగా ఎన్నికలు నిర్వహించడం వల్ల ఖజానాపై గణనీయమైన ఆర్థిక భారం పడిందన్న కేంద్ర మంత్రి, గత పార్లమెంట్, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల ఖర్చులు రూ. 4,500 కోట్లకు మించాయన్నారు.

కేబినెట్ ముందు రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ నివేదికను సమర్పించడం న్యాయ మంత్రిత్వ శాఖ 100 రోజుల ఎజెండాలో భాగం. లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని ఉన్నతస్థాయి కమిటీ సిఫార్సు చేసింది. ఆ తర్వాత 100 రోజుల్లోగా ఏకకాలంలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సిఫార్సు చేసింది. సిఫార్సుల అమలును పర్యవేక్షించేందుకు కమిటీ ఏర్పాటు చేయాలని కమిటీ ప్రతిపాదించింది.

ఏకకాల ఎన్నికలతో, దేశంలో రెండు దశల్లో ఎన్నికలు జరుగుతాయి. మొదటిది, పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీలకు, తరువాత 100 రోజుల్లో స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కమిటీ సిఫార్సు చేసింది. సంప్రదింపులు జరిపిన 47 రాజకీయ పార్టీలలో 32 ఏకకాల ఎన్నికల కాన్సెప్ట్‌పై సానుకూలంగా స్పందించాయి. అన్ని పార్టీలను సంప్రదించిన తర్వాతే రామ్ నాథ్ కోవింద్ కమిటీ నివేదికను రూపొందించినట్లు మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు.

ఈ నేపథ్యంలోనే ఏకకాల ఎన్నికలతో అయ్యే ఖర్చు తగ్గుతుంది. గత నవంబర్‌లో తెలంగాణలో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు అయిన ఖర్చు రూ. 701 కోట్లు. లోక్‌సభ ఎన్నికలకు అయిన ఖర్చు రూ. 622 కోట్లు. మొత్తం రూ. 1323 కోట్లు ఖర్చు పెట్టింది ఎలక్షన్ కమిషన్. దేశవ్యాప్తంగా జరిగిన జనరల్ ఎలక్షన్స్‌కు ఎన్నికల సంఘం పెట్టిన ఖర్చు 10వేల కోట్ల రూపాయలు. ఒకవేళ.. వన్ నేషన్-వన్ ఎలక్షన్ జరిగితే ఈ ఖర్చు భారీగా తగ్గుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే, ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే, మ్యాన్ పవర్ కూడా కలిసొస్తుంది. రెండు ఎన్నికలను ఒకేసారి నిర్వహిస్తే.. ఎన్నికల ఖర్చు, సిబ్బంది వినియోగం, నిర్వహణ భారం అన్నీ తగ్గుతాయనేది ఓ ఆలోచన. పైగా ఓటింగ్ శాతం కూడా పెరుగుతుంది. ఓటు వేయడం కోసం రెండుసార్లు, రెండు రోజులు పనులు మానుకుని రానక్కర్లేదు. ఒకసారి బూత్‌లోకి వెళ్తే.. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు ఓటు వేసి రావొచ్చు..!

## డేట్ ఫిక్స్





నా చేరిక మీద సోషల్ మీడియాలో ఏవో ట్రోల్స్ చేస్తున్నారు. కూటమి పక్షాన అందరం కలిసి పని చేస్తాం. పవన్ కళ్యాణ్ ఆదేశాల ప్రకారం నా పని తీరు ఉంటుంది. మూడు పార్టీల నేతలను కలుపుకుని వెళ్తాం. అడిగిన వెంటనే ఆహ్వానించినందుకు పవన్‌కు ధన్యవాదాలు. ఒంగోలులో ఎప్పుడు చేరేది త్వరలో తేదీ ఖరారు చేస్తాం” అని మాజీమంత్రి బాలినేని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

**ఈనెల 22న జనసేనలోకి వైసీపీ కీలక నేతలు**

ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌తో వైఎస్సార్సీపీ కీలక నేతలు బాలినేని శ్రీనివాసరెడ్డి, సామినేని ఉదయభాను జనసేన కార్యాలయంలో భేటీ అయ్యారు. పలు కీలక విషయాలపై చర్చించారు. దాదాపు గంటపాటు ఇరువురు నేతల మధ్య చర్చ జరిగింది. ఈనెల 22న జనసేనలో చేరుతున్నట్లు బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, ఉదయభాను ప్రకటించారు. వైసీపీపై సంచలన వ్యాఖ్యలు చేశారు.

## పార్టీ కీలక నేతలతో జగన్ అత్యవసర సమావేశం..

బాలినేని వెంట వెళ్లకుండా ఉండేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నారు జగన్. ఏ విధంగా ముందుకెళ్లాలి అనే దానిపై చర్చ జరుగుతోంది.

అటు మరో మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను సైతం వైసీపీని వీడనున్న నేపథ్యంలో జగ్గయ్యపేటలో ఉన్న పరిస్థితులపై జగన్ చర్చిస్తున్నారు. ఇప్పటికే జగ్గయ్యపేట మున్సిపాలిటీకి సంబంధించి కౌన్సిలర్లు అందరూ టీడీపీలో చేరిపోయారు. మున్సిపాలిటీని వైసీపీ కోల్పోయిన పరిస్థితి. ఈ పరిస్థితుల్లో జగ్గయ్యపేటలో కేడర్ ను ఏ విధంగా కాపాడుకోవాలని అనే దానిపై పార్టీ కీలక నేతలతో జగన్ డిస్కస్ చేస్తున్నట్లు తెలుస్తోంది. వీటితో పాటు తిరుమల లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు చేసిన సంచలన ఆరోపణల అంశంపైనా పార్టీ నేతలతో జగన్ చర్చిస్తున్నారు.

వ్యక్తులు పార్టీని వీడితే వాళ్ల ప్లేస్ ను ఏ విధంగా రీప్లేస్ చేయాలి, అక్కడున్న కేడర్ ను, ద్వితీయ శ్రేణి నేతలను ఏ విధంగా మోటివేట్ చేయాలి అన్న అంశాలపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. నేతలు వెళ్లిపోయినా కేడర్ చాలా ముఖ్యం. దీంతో కేడర్ ను కాపాడుకునేందుకు ఏ విధమైన చర్యలు తీసుకోవాలి అనేదానిపై వైఎస్ జగన్ డిస్కస్ చేస్తున్నారు.

## మౌనవ్రతంలో మాజీ ముఖ్యమంత్రి..!

అన్నట్టుగా తలపడుతోంది ప్రతిపక్ష బీఆర్ఎస్. ఎమ్మెల్యేల ఫిరాయింపుల నుంచి, పీఏసీ చైర్మన్ పదవి వివాదాస్పదం అవడం దాకా రుణమాఫీ నుంచి సెక్రటేరియట్ ముందు రాజీవ్ విగ్రహ ఏర్పాటు దాకా కాంగ్రెస్‌ను కడిగిపారేసే ప్రయత్నం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. కౌశిక్‌రెడ్డి ఇంటిపై దాడి ఎపిసోడ్‌తో.. వ్యవహారం మరింత పీక్స్‌కు చేరింది.

అంశం ఏదైనా రాష్ట్ర ప్రభుత్వాన్ని అడుగుడుగునా ఇరకాటంలో పెట్టేందుకు ప్రజల ముందు దోషిగా నిలబెట్టేందుకు.. ప్రయత్నం చేస్తున్నారు హరీష్‌రావు, కేటీఆర్. వరుస ఆందోళనలతో కాంగ్రెస్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు.

పెద్దసార్ స్పందించడం లేదేంటన్నదే అందరినీ తొలిచి వేస్తున్న ప్రశ్న. 14ఏళ్లు ఉద్యమాన్ని నడిపిన నాయకుడు.. 10ఏళ్లు రాష్ట్రాన్ని ఏలిన నాయకుడు.. ఇప్పుడిలా మౌనవ్రతంలోకి వెళ్లడం పార్టీవర్గాలనే కాదు, సామాన్య ప్రజలను కూడా ఆశ్చర్యపరుస్తోంది. అంశమేదైనా కేసీఆర్ అంటేనే ఫైర్%ా% అన్నట్టుగా ఉంటుంది ఆయన వ్యవహార శైలి. కానీ, ఇప్పుడిలా కామ్‌గా ఉండిపోవడం ఆయన అభిమానులకు అస్సలు నచ్చట్లేదు. అధికారం ఉంటేనే వస్తారా? లేదంటే జనాలు అక్కర్లేదా? అనే వారూ ఉన్నారు.

పిచ్చుక మీద బ్రహ్మాస్త్రంలా సీఎం రేవంత్‌రెడ్డి సహా కాంగ్రెస్‌నేతలకు తాను సమాధానం చెప్పాల్సిన అవసరం లేదనుకుంటున్న కేసీఆర్ ఆ బాధ్యతను కేటీఆర్, హరీష్‌లకు అప్పగించారట. అందుకే, సీఎం రేవంత్ విమర్శలు, ఆరోపణలు చేయడమే గాని, కేసీఆర్ నుంచి ఇప్పటివరకూ ఒక్క కౌంటర్ కూడా రాలేదు. ఇక, పార్టీని గాడిన పెట్టే బాధ్యతను కూడా హరీష్, కేటీఆర్‌లకే వదిలేసిన కేసీఆర్ వారి సత్తాకు పరీక్ష పెడుతున్నారనే చర్చ కూడా జరుగుతోంది. అందుకే, ఎవరికివారు పోటాపోటీగా ప్రభుత్వాన్ని ఇరుకున పెడుతూ ముందుకెళ్తున్న బావబామ్మర్దులు కేసీఆర్ టాస్క్‌ను పూర్తిచేసే పనిలోనే ఉన్నారట.

అసలు, ప్రస్తుతం కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ చేస్తున్న పోరాటం కూడా%ా% కేసీఆర్ దొనిర్దేశంలోనే జరుగుతోందిట. అధినేత ఎలా చెబితే అలా ముందుకెళ్తూ%ా% రాజకీయాల్ని వేడెక్కిస్తున్నారట బీఆర్ఎస్ నేతలు. ఈ లెక్కన లోపల ఉంటూనే ఇంత రచ్చ చేస్తున్న కేసీఆర్.. ఒకవేళ నిజంగానే బయటకు వస్తే.. కాంగ్రెస్ వాళ్లు తట్టుకుంటారా? అనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నాయి గులాబీశ్రేణులు. అంతేకాదు, అధినేత మౌనం వెనక పెద్ద వ్యూహం లేకపోలేదని కూడా అంచనా వేసుకుంటున్నాయి. కచ్చితంగా భారీ పొలిటికల్ స్కెచ్‌తోనే.. ఆయన సైలెన్స్ మెయింటెన్ చేస్తున్నారనీ.. దాంతో భారీ విస్ఫోటనం తప్పకపోవచ్చనే ధీమానూ వ్యక్తం చేస్తున్నాయి.

# సిద్దేశ్వరం అలుగు.. ఆంధ్రప్రదేశ్‌కు వెలుగు



రాయలసీమ సాగునీటి కష్టాలకు పరిష్కారంగా సిద్దేశ్వరం అలుగు నిర్మాణం చేపట్టాలన్న ప్రజా ఆకాంక్ష దశాబ్దాలుగా కొనసాగుతున్నది. అయితే కేవలం రాయలసీమకే కాకుండా ఆంధ్రప్రదేశ్‌లో వెలుగులు నింపే ఆస్కారం ఈ అలుగు నిర్మాణంతో పుష్కలంగా ఉంది. రాయలసీమ సాగునీటి ఇబ్బందులకు పరిష్కారంగా విశ్రాంత సాగునీటి నిపుణులు సుబ్బరాయుడు రెండు దశాబ్దాలుగా ప్రభుత్వం ముందుంచుతున్న సిద్దేశ్వరం అలుగు ప్రతిపాదనకు దారితీసిన పరిస్థితులు, ఈ అలుగు నిర్మాణం ఆంధ్రప్రదేశ్‌కు ఏ విధంగా వెలుగును నింపుతుందో తెలిపే చిరు ప్రయత్నమే ఈ వ్యాసం.

బచావత్ ట్రిబ్యునల్ 75 శాతం సంవత్సరాల నీటి లభ్యత ఆధారంగా (వంద సంవత్సరాలలో 75 సంవత్సరాలు తప్పక నీరు లభించేలాగా) కృష్ణా జలాల నీటి పంపిణి చేసింది. రాయలసీమ ప్రాజెక్టులకు ప్రధానంగా కృష్ణా ఉపనది తుంగభద్ర, కృష్ణా నదుల నీటిని బచావత్ ట్రిబ్యునల్ కేటాయించింది. కాని రాయలసీమకు కేటాయించిన నీటిని ఏ సంవత్సరం కూడా వినియోగించుకోలేకపోతున్నది. నీటిని నిలువ చేసుకునే రిజర్వాయర్లు లేకపోవడం, రిజర్వాయర్ల నుంచి పంట పొలాలకు అందించే ప్రధాన కాలువలు తగినంత నీటి ప్రవాహ సామర్థ్యంతో నిర్మించకపోవడం లేదా ప్రధాన కాలువల నుంచి ఉప కాలువలు, పంట కాలువలు సక్రమంగా లేకపోవడం ఈ దుస్థితికి ప్రధాన కారణాలు.

రాయలసీమ ప్రాజెక్టులకు కేటాయించిన తుంగభద్ర జలాలు కర్నూలు జిల్లాలోని సంకేసుల బ్యారేజి దాటి నంద్యాల జిల్లాలోని సిద్దేశ్వరం, సంగమేశ్వరం ఎగువన కృష్ణా నదిలో కలుస్తున్నాయి. ఈ నీరంతా అక్కడ నుంచి దిగువకు శ్రీశైలం వైపు ప్రవహిస్తున్నది. శ్రీశైలం వద్ద కృష్ణా నదికి అడ్డంగా ప్రాజెక్టు నిర్మించడం వల్ల కృష్ణా జలాలు శ్రీశైలం రిజర్వాయర్‌లో నిలువ ఉంచే అవకాశం కలిగింది. శ్రీశైలం ప్రాజెక్టులో పూర్తిస్థాయిలో నీరు నిలువ ఉంచినపుడు వెనుకకు ఎగదన్నడం వలన సిద్దేశ్వరం, సంగమేశ్వరం ప్రాంతం అంతా సముద్రాన్ని తలపిస్తుంది. అయితే రాయలసీమ ప్రాజెక్టులు ఆ నీటిని ఉపయోగించుకునే అవకాశం లేదు. శ్రీశైలం ప్రాజెక్టు గేట్లు ఎత్తితే కృష్ణా జలాలు దిగువన ఉన్న నాగార్జునసాగర్ వైపు పరుగులు తీస్తాయి. రాయలసీమలోని ఒక్క ఎకరాకు కూడా నీరు లభించని పరిస్థితి ఉంది.

రాయలసీమ ప్రాజెక్టులకు నీరు లభించడానికి ప్రధానంగా పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ పొందే అవకాశాన్ని అంజయ్య ముఖ్యమంత్రిగా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం కల్పించింది. 19 టీఎంసీల నికర జలాల కేటాయింపుతో ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టును కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి తెలుగుగంగ ప్రాజెక్టు, మద్రాసుకు త్రాగునీటిని అందించే పథకాన్ని తర్వాత ఎన్‌టి రామారావు ముఖ్యమంత్రిగా ఉండగా తెలుగుదేశం ప్రభుత్వం చేపట్టింది. గాలేరు%-%-నగరి, హంద్రీ%-%నీవా ఎత్తిపోతల పథకాలకు కూడా ఎన్‌టి రామారావు ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులను మంజూరు చేసింది. పోతిరెడ్డిపాడు నుంచి గాలేరు%-%నగరి ప్రాజెక్టు, కేసి కెనాల్‌కు నీటి కేటాయింపులు (తుంగభద్ర డ్యాం నుంచి కేసి కెనాల్‌కు ఉన్న 10 టీఎంసీల నీటిని హెచ్‌ఎల్‌సీకి బదలాయించి, దీనికి బదులుగా కేసి కెనాల్‌కు 10 టీఎంసీల నీరు శ్రీశైలం రిజర్వాయర్ నుంచి పొందేలాగా అంతర్గత సర్దుబాటుకు అనుమతులు ఇవ్వడం), హంద్రీనీవా ఎత్తిపోతల పథకంను (శ్రీశైలం రిజర్వాయర్‌లో 834 అడుగుల వరకు నీరు ఉన్నప్పుడు నంద్యాల జిల్లా మల్యాల గ్రామం వద్ద హంద్రీనీవా ఎత్తిపోతల ప్రాజెక్టు) వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టింది.

అయినా శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నీటిని రాయలసీమ ప్రాజెక్టులు వినియోగించుకోలేకపోతున్నాయి. దీనికి ప్రధాన కారణం శ్రీశైలం రిజర్వాయర్‌లో తగిన స్థాయిలో నీరు నిలువలేకపోతే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్‌కు నీరు అందదు. సముద్రమట్టానికి 841 అడుగుల ఎత్తున ఉన్న నంద్యాల జిల్లా పోతులపాడు గ్రామం వద్ద పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నిర్మాణం చేపట్టారు. శ్రీశైలం రిజర్వాయర్‌లో 854 అడుగుల నీరు ఉన్నప్పుడు మాత్రమే సుమారు 6000 క్యూసెక్కుల నీటిని పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమ ప్రాజెక్టులకు తీసుకునే అవకాశం ఉంటుంది. శ్రీశైలం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు ఉన్నప్పుడే 44 వేల క్యూసెక్కుల నీటిని రాయలసీమ ప్రాజెక్టులకు తీసుకునే అవకాశం ఉంటుంది. శ్రీశైలం రిజర్వాయర్ నుంచి నాగార్జునసాగర్ ఆయకట్టుకు, కృష్ణాడెల్టాకు కేటాయించిన 80 టీఎంసీలు కృష్ణా జలాలకు అదనంగా నీటిని తరలిస్తుండటంతో, ఆ నీరంతా సముద్రం పాలు అవుతున్నది. దీనివలన శ్రీశైలం రిజర్వాయర్‌లో నీటి నిలువ 854 అడుగులు దిగువకు పడిపోతుండడంతో రాయలసీమకు చుక్క నీరు కూడా దక్కడం లేదు.


శ్రీశైలంలో నీరు నిలువ ఉంచి దిగువన ఉన్న సాగర్, కృష్ణాడెల్టా ఆయకట్టుకు, బ్యాక్ వాటర్ మీద ఆధారపడిన రాయలసీమ ప్రాజెక్టుల ఆయకట్టుకు నీరు సక్రమంగా అందించాల్సిన అవసరం ఉంది. నంద్యాల జిల్లా సిద్దేశ్వరం వద్ద 860 అడుగుల ఎత్తుతో అలుగు నిర్మాణం చేపట్టడం వల్ల అన్ని సాగునీటి ప్రాజెక్టుల ఆయకట్టుకు నీరు సక్రమంగా అందించే వెసలుబాటు కలుగుతుంది. అలుగు నిర్మాణం చేపడితే శ్రీశైలంలో 860 అడుగుల ఎత్తులో నీరు ఉన్నప్పుడు అలుగు దిగువన శ్రీశైలం రిజర్వాయర్ వరకు 60 టీఎంసిల నీరు, అలుగు ఎగువ భాగాన పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ వరకు సుమారు 50 టీఎంసిల నీరు నిలువ ఉంటుంది. దీనితో నాగార్జునసాగర్‌లో నిలువ ఉండే 312 టీఎంసీలతో పాటు, అలుగు ఉన్న ప్రాంతం నుంచి దిగువన శ్రీశైలం రిజర్వాయర్ వరకు ఉండే నీటిని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం, గుంటూరు, కృష్ణా జిల్లాల అవసరాలకు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. అలుగుకు ఎగువ భాగన ఉన్న నీటిని రాయలసీమ, నెల్లూరు జిల్లాల ప్రాజెక్టులకు వినియోగించుకునే అవకాశం లభిస్తుంది. దీంతో కృష్ణానది మీద ఆధారపడిన ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల అవసరాలకు సాగునీటిని, తాగునీటిని వినియోగించుకోవడానికి అవకాశం లభిస్తుంది.

315 టీఎంసీల సామర్థ్యంతో నిర్మించిన శ్రీశైలం రిజర్వాయర్‌లో పూడిక చేరడం వల్ల నేడు సుమారు 185 టీఎంసీల సామర్థ్యానికి తగ్గిపోయింది. ఇదే విధంగా కొనసాగితే ఇది ఒక పెద్ద కుంటలాగా మిగిలిపోయే ప్రమాదం ఉంది. దీని జీవితకాలం పెంచడం ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని సాగునీటి ప్రాజెక్టుల సక్రమ నిర్వహణకు అత్యంత కీలకం. సిద్దేశ్వరం అలుగు నిర్మాణం వల్ల శ్రీశైలం రిజర్వాయర్‌లో పూడిక చేరికను నివారించి, దాని జీవితకాలాన్ని పెంచడంలో ఉపయోగపడుతుంది. అలుగు నిర్మాణం శ్రీశైలం ప్రాజెక్టుకు రక్షణ అవుతుంది. దీనికి కొత్తగా భూసేకరణ చేయాల్సిన అవసరం లేదు. వరద బారి నుంచి శ్రీశైలం రిజర్వాయర్‌ను రక్షించుకోవడం, ప్రాజెక్టు జీవితకాలాన్ని పెంచుకోవడం, నీటి నిర్వహణను సక్రమంగా చేపట్టడం, విద్యుత్తు ఉత్పత్తి చేపట్టడం, తాగునీటి ఇబ్బందులను తొలగించడం తదితర బహుళ ప్రయోజనాలను తక్కువ నిర్మాణ సమయంతో, తక్కువ పెట్టుబడితో సిద్దేశ్వరం అలుగు నిర్మాణం ద్వారా సాధించవచ్చు.

సిద్దేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి 1951లోనే ప్లానింగ్ కమిషన్ అనుమతులు ఇచ్చింది. తరతరాలుగా ఈ ప్రాజెక్టు సాధనకు ప్రభుత్వాలు స్పందించని నేపథ్యంలో, అనేక బహుళార్థ ప్రయోజనాలను కలిగి ఉన్న సిద్దేశ్వరం అలుగు నిర్మాణం కోసం రాయలసీమ సాగునీటి సాధన సమితి, అనేక ప్రజా సంఘాలతో కలిసి మే 31, 2016న సిద్దేశ్వరం అలుగు ప్రజా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్న 2019 సంవత్సరంలో నిండు ఎండాకాలం మే నెలలో నాలుగు రోజుల 100 కిలోమీటర్ల పాదయాత్రను నంద్యాల నుంచి సిద్దేశ్వరం వరకు వేలాదిమంది ప్రజలతో విజయవంతంగా నిర్వహించింది. రాజకీయ పార్టీలపై ఒత్తిడి తీసుకొస్తున్నది. ఈ పరంపరలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అన్ని రాజకీయ పార్టీలు సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి మద్దతును ప్రకటించాయి.

కల్వకుర్తి నంద్యాల మధ్య నిర్మించే జాతీయ రహదారిలో భాగంగా సంగమేశ్వరం వద్ద కృష్ణానదిపై నిర్మిస్తున్న తీగెల వంతెనకు బదులుగా ‘అలుగుతో కూడిన వంతెన’ నిర్మాణం చేపట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అనేక కార్యక్రమాలు నిర్వహించింది. 2024 సార్వత్రిక ఎన్నికల ముందు ఈ అంశాలను నారా లోకేష్, నారా చంద్రబాబు నాయుడుల దృష్టికి సమితి నాయకులు తీసుకొచ్చారు. గత ఆగస్టులో చంద్రబాబునాయుడు శ్రీశైలం ప్రాజెక్టు వద్ద కృష్ణమ్మకు జలహారతి ఇస్తున్న సందర్భంలో, సిద్దేశ్వరం అలుగు నిర్మాణానికి అవసరమైన కార్యాచరణ చేపడతామని ప్రకటించారు. ఆంగ్లేయుల కాలం నుంచి వందేళ్ళుగా సిద్దేశ్వరం ప్రాజెక్టు నిర్మాణ అంశం రాయలసీమ ప్రజానీకాన్ని ఆశల పల్లకిలోనే ఊరేగిస్తున్నది. ఇప్పటికైనా ఆంధ్రప్రదేశ్‌కు వెలుగులను అందించే సిద్దేశ్వరం అలుగు నిర్మాణాన్ని రాజకీయ దృఢసంకల్పంతో అత్యంత త్వరగా చేపట్టాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది.

## ఏపీకి అదానీ ఫౌండేషన్ భారీ విరాళం..



**అమరావతి :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏపీలోని చాలా జిల్లాలు చిగురుటాకులా వణికిన విషయం తెలిసిందే. వరదల ధాటికి చాలా మంది నిరాశ్రయులయ్యారు. వేల కోట్ల ఆస్తి నష్టం జరిగింది. రాష్ట్రవ్యాప్తంగా 40 మందికిపైగా చనిపోయారు. లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగింది. విజయవాడలో బుడమేరు పొంగి.. పదుల సంఖ్యలో కాలనీలు జలమయమయ్యాయి. ప్రభుత్వం తమను ఆదుకోవాలంటూ బాధితులు వేడుకుంటున్నారు.

అయితే.. ఆపత్కాలంలో మేమున్నామంటూ ముందుకొస్తున్నారు దాతలు. ఇప్పటికే సినీ రంగానికి చెందిన వారితోపాటు.. పారిశ్రామికవేత్తలు, వ్యాపారవేత్తలు ఏపీకి భారీగా విరాళాలు అందించారు. తాజాగా అదానీ గ్రూప్ కూడా బాధితులకు అండగా నిలిచేందుకు ముందుకు వచ్చింది. ఏకంగా రూ.25 కోట్ల విరాళాన్ని అందజేసింది. వరద బాధితుల సహాయార్థం రూ.25 కోట్లు అందిస్తున్నట్టు అదానీ ఫౌండేషన్ చైర్ పర్సన్ డాక్టర్ ప్రీతి అదానీ ప్రకటించారు. సీఎం చంద్రబాబును కలిసిన అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీ రూ.25 కోట్ల చెక్కును గురువారం అందజేశారు. అదానీ ఫౌండేషన్ చైర్మన్ ప్రీతి అదానీకి, అదానీ పోర్ట్స్ ఎండీ కరణ్ అదానీకి బాబు.. కృతజ్ఞతలు తెలియజేశారు. వరద బీభత్సంతో కుదేలైన ప్రజల జీవితాలను మళ్లీ నిలబెట్టడానికి అదానీ గ్రూప్ సాయం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చంద్రబాబు ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

# అక్కసుతోనే ఆరోపణలు.. విపక్షాలపై మంత్రి ఆగ్రహం..

**హైదరాబాద్,** విపక్ష పార్టీపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తీవ్ర విమర్శలు గుప్పించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రతిపక్ష పార్టీలు తమపై విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. గురువారం నాడు మీడియాతో మాట్లాడిన ఆయన.. గత ప్రభుత్వం చేసిన అవినీతిని కప్పిపుచ్చుకోవడానికే తమపై విమర్శలు చేస్తున్నారని అన్నారు. ఇచ్చిన హామీలే కాదు.. ఇవ్వని హామీలను కూడా రేవంత్ సర్కార్ నెరవేరుస్తోందన్నారు. విద్య, వైద్యంపై తమ ప్రభుత్వం ఎంతో చిత్తశుద్ధితో ఉందన్నారు.

మిషన్ భగీరథపై సర్వే చేస్తే 53 శాతం ఇళ్లకు మంచి నీళ్లు రావడం లేదని తేలిందని మంత్రి పొంగులేటి పేర్కొన్నారు. రూ. 73 వేల కోట్లు వ్యవసాయ రంగానికి కేటాయించామన్నారు. రూ. 18 వేల కోట్లు రైతు రుణమాఫీ చేశామన్నారు. అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ పక్కాగా జరుగుతుందని మంత్రి స్పష్టం చేశారు. ఇరిగేషన్‌లో రూ. లక్ష కోట్లు, మిషన్ భగీరథ పేరుతో రూ. 15 నుంచి 20 వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారని మంత్రి పొంగులేటి ఆరోపించారు.


బీఆర్ఎస్ పది సంవత్సరాల పాలనలో ఏమీ చేయలేదని విమర్శించారు. పని చేస్తున్న కాంగ్రెస్‌పై గత పాలకులు బట్టకాల్చి మీద వేస్తున్నారని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నెలాఖరులో గానీ.. వచ్చే నెల మొదటి వారంలో కానీ అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేస్తామన్నారు. దార్శనికత ఉండాలి కానీ.. అవకాశవాదం ఉండకూడదన్నారు. ఓరుగల్లు అభివృద్ధిని గత పాలకులు పట్టించు కోలేదని మంత్రి విమర్శించారు. రాష్ట్రంలో రూ. 650 కోట్లు విద్య కోసం



ఖర్చుచేసి తమ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుందన్నారు. 119 నియోజకవర్గాల్లో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ని కట్టించబోతున్నామని మంత్రి చెప్పారు. 25 ఎకరాలలో ఒక్కొక్క ఇంటిగ్రేటెడ్ స్కూల్‌ని నిర్మిస్తున్నామన్నారు. రూ. 110 కోట్లతో అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తామని మంత్రి చెప్పారు. ప్రతిపక్షంగా చెప్పుకుంటున్న వారు ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి చూసి జీర్ణించుకోలేకపోతున్నారని.. అందుకే ప్రతి దాన్ని రాద్ధాంతం చేస్తున్నారని మంత్రి విమర్శించారు. వారి ప్రభుత్వ హయాంలో వారు చేసి చేసిన తప్పులు.. ఇప్పుడూ జరుగుతున్నాయనే భ్రమలో బ్రతుకుతున్నారంటూ బీఆర్ఎస్ నేతలనుద్దేశించి మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఎద్దేవా చేశారు

## రైతుల పోరుబాటతో కాంగ్రెస్ వెన్నులో వణుకు.. అధికార పార్టీపై నిప్పులు చెరిగిన హరీశ్

**హైదరాబాద్ :** హామీలు అమలు చేయకుండ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నట్టేట ముంచుతోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. అధికార పార్టీ రైతులకు అన్యాయం చేస్తోందని విమర్శిస్తూ తన అధికారిక ఎక్స్ ఖాతాలో హరీశ్ ఓ పోస్ట్ చేశారు. “రుణమాఫీ కాలేదన్న ఆవేదనతో రైతులందరూ సంఘటితమై ఛలో ప్రజాభవన్?కు పిలుపునిస్తే కాంగ్రెస్ ప్రభుత్వానికి వణుకుపుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా రైతులను, రైతు సంఘాల నాయకులను ఎక్కడిక్కడ పోలీసు స్టేషన్లలో నిర్బంధిస్తూ వారిపై కక్ష తీర్చుకుంటోంది. రుణమాఫీ కోసం పోరుబాట పట్టిన రైతన్నలను అరెస్టులు చేయడం దుర్మార్గమైన చర్య. బీఆర్ఎస్ పార్టీ పక్షాన దీనిని తీవ్రంగాఖండిస్తున్నాం. అరెస్టులు చేసిన రైతులను తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నాం.



## 15 సంవత్సరాల లోపు జిల్లా చదరంగం జట్టు ఎంపిక పోటీలు.

**నంద్యాల సెప్టెంబర్ 19 ( రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల జిల్లా చెస్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22 వ తేదీన రామకృష్ణ డిగ్రీ కళాశాల వివేకానంద ఆడిటోరియంలో 15 సంవత్సరాల లోపు ఓపెన్ మరియు బాలికల నంద్యాల జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నారు.

ఎంపికైన జిల్లా జట్లు రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారు.

ఈనెల 21వ తేదీ లోపు ఆసక్తి గల క్రీడాకారులు ఎంట్రీలు నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్ 9010451585 సంప్రదించాలని కోరారు
నంద్యాల జిల్లా చెస్ సంఘం
అధ్యక్షులు
డాక్టర్. జి. రవికృష్ణ
ప్రధాన కార్యదర్శిజి.రామ సుబ్బారెడ్డి తెలిపారు

## వ్యాధి నిర్ధారణ వ్యవస్థ పరిశీలన.



**వెలుగోడు సెప్టెంబర్ 19 రిపబ్లిక్ న్యూస్** వెలుగోడు మండల మోత్కూరు, మాధవరం గ్రామాలలో గురువారం రైతులు సాగుచేసిన న పసుపు మరియు వరిలో తెగులు వ్యాధి నిర్ధారణ వ్యవస్థను మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్, నంద్యాల డిఆర్సి ఏవో హేమలత క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగుచేసిన పంటలో పురుగు ఉనికిని, చీడపీడల ఉధృతి మరియు వ్యాధి నిర్ధారణ పిడిఎస్ఎస్ యాప్ ద్వారా క్షేత్రస్థాయి నుండి ప్రభుత్వానికి నివేదిక అందుతుందని తెలిపారు. యాప్ ద్వారా వచ్చిన సమాచారాన్ని డిఆర్సి అధికారులు పరిశీలించి ఆచార్య ఎన్జీరంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలకు అందజేయడం జరుగుతుందన్నారు. శాస్త్రవేత్తలు వ్యాధికి తెగుళ్ళకు సస్యరక్షణ చర్యలు అంతరజాలంలో తెలియ చేస్తారు.ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది నాగలింగం రైతులు సాయి రెడ్డి సుధాకర్ రెడ్డి పలువురు పాల్గొన్నారు.

## శ్రీ కామేశ్వరి మహానందిశ్వరుల తరపున పట్టు వస్త్రాల సమర్పణ



**కాణిపాకం సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్):** కాణిపాకం వరసిద్ధి వినాయక స్వామి వార్లకు జరుగుతున్న వార్షిక బ్రహ్మోత్సవాలకు శ్రీ కామేశ్వరీ మహానందీశ్వరుల తరుపున పట్టువస్త్రాలను ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి,విజయ దంపతులు,ఏఈఓ, వేదపండితులు ప్రధానార్చకులు భక్తితో సమర్పించినారు.

ముందుగా కాణిపాకం ఆలయ కార్యనిర్వహణాధికారి గురుప్రసాద్, వేదపండితులు సుబ్బారావు స్వామి, ప్రధానార్చకులు,ఏఈఓ,లు వేదమంత్రాలు, మంగళవాయిద్యాలతో సాదరంగా ఆహ్వానించారు.అనంతరం వరసిద్ధి వినాయకుడికి ప్రత్యేక పూజలు నిర్వహించి పట్టువస్త్రాలను అలంకరించారు

# రైతుకు నేస్తం -సేంద్రియ వ్యవసాయం

### సేంద్రియ ఎరువులు ప్రయోజనాలపై రైతన్నలకు అవగాహన




**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్:** రైతుకు నేస్తం సేంద్రియ ఎరువులు, నేలను ఆరోగ్యంగా ఉంచటంలో మరియు సూక్ష్మజీవులు సహజసిద్ధంగా పనిచేయటంలో సేంద్రియ ఎరువులు వాడటం వల్ల తక్కువ పెట్టుబడితో రైతన్నలు ఎక్కువ దిగుబడులు సాధించేందుకు దోహత పడతాయని వినూత్న ఆగ్రోటెక్ ఎల్ఎల్ పి మార్కెటింగ్ డెవలప్మెంట్ ప్రతినిధులు బిల్లా రాజేష్ యాదవ్ ఎస్ఓ .మస్తాన్ ,ఎఫ్ఏ దస్తగిరిలు అన్నారు గురువారం ఆళ్లగడ్డ మండల పరిధిలోని కొండాపురం గ్రామంలో వినూత్న ఆగ్రో టెక్ ఎల్ ఎల్ పి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు రైతులతో మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు వాడటం వల్ల మొక్కకు కావలసిన స్థూల సూక్ష్మ పోషక పదార్థాలైన నత్రజని భాస్వరం పొటాష్ కాల్షియం



మెగ్నీషియం గంధకం ఇనుము జింకు రాగి మొదలగు మూలకాలను పంటలకు సమపాళ్లల్లో అందిస్తాయన్నారు. అధిక దిగుబడులు సాధించవచ్చు అన్నారు. "వినూత్న ఆగ్రో టెక్ ఎల్.ఎల్.పి" వారి రైతులకు అందించే సేంద్రీయ జీవన ఎరువులైనా "యోధ సేంద్రియ ఎరువులు, యోధ సి ఎం ఎస్ జీవన్ గోల్డ్, రైతుమిత్ర, ప్రణయ్, గ్రో హై గ్రాన్యూల్స్, గ్రో హై లిక్విడ్, డెల్టా ప్రో, తులిప్, యువరాజ్, డైనమైట్, జనని, ట్రిగర్ , టర్బో కే జి ఎఫ్6, రోషిని, ఉజ్వల్ , త్రిసూల్, ధర్మవీర్ , రత్నా, పృథ్వీరాజ్, తిరంగా, నైట్స్, త్రిలోక్, ఇగ్నిస్ 5 అవనీ న్యూట్రిన్, అవనీ గోల్డ్, అవనీ జింక్ ప్లస్ (జెడ్33%ఎస్15%), అవనీ న్యూట్రిసోల్ కే ఎం ఎస్-22.18.20), అవనీ కాబన్, అవనీ సీ గోల్డ్ (పౌడర్/గ్రానువాల్స్) , అవనీ సీ గోల్డ్ (లిక్విడ్), అగ్ని, విభా ప్లస్, వాల్ట్, ధన్వి , వాల్ యు ప్యాక్, టిల్లరింగ్ బోస్టర్, సాయిల్ రిసువేటర్, లను పంటకు వాడి భూమిలోని మిత్ర పురుగులు అయినటువంటి సూక్ష్మజీవులను అభివృద్ధి చేసి మొక్కలకు కావాలసిన పోషకాలను అందించి మొక్కలలో వ్యాధి నిరోధక శక్తిని పెంచుతాయని రైతులకు తెలిపారు. "వినూత్న ఆగ్రో టెక్ఎల్.ఎల్.పి." సంస్థ గత 2 సం?రాలుగా సేంద్రీయ, జీవన ఎరువులను అందిస్తూన్నారు. పలు గ్రామాల్లో సేంద్రీయ జీవన ఎరువులపై "రైతు అవగాహన సదస్సు " కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. సేంద్రియ ఎరువులు వాడటం వల్ల భూమిలోని సూక్ష్మ పోషక పదార్థాల నిష్పత్తి మారుతుంది దీని వలన భూమిలోని మొక్కలకు హాని కలిగించే నులిపురుగులు సిలింద్రాలు కొంతవరకు అదుపులో ఉంటాయన్నారు . సేంద్రియ ఎరువుల నుంచి నత్రజని మెల్లగా విడుదలవడం వలన నత్రజని నష్టం తక్కువగా ఉంటుందన్నారు నేలలోని సూక్ష జీవులకు మంచి ఆహారంగానూ అవి అభివృద్ధి చెంది చురుకుగా పనిచేయటానికి ఉపయోగపడుతుందన్నారు పండ్లు కూరగాయలు ఇతర పంటలలో నాణ్యత పెరుగుతుందన్నారు ఉప్పు నేలలు చౌడు నెలలలో లవణక్షర గుణాలు తగ్గించి పంటల దిగుబడును పెంచడంలో సేంద్రియ ఎరువులు దోహత పడతాయి అన్నారు బరువు నేలలు గుల్ల భారీ వేర్లు చక్కగా పెరగటానికి సహాయపడుతుందన్నారు మీరు ఇంకటం పెరిగి మురుకు సౌకర్యం నీటిని గ్రహించి తేమను ఎక్కువ కాలం పట్టి ఉంచే శక్తి పెరగటానికి సేంద్రియ ఎరువులు దోహాజ పడతాయి అన్నారు పెట్ట పరిస్థితిని తట్టుకునే శక్తి భూమిలో పెరుగుతుందన్నారు భూమిలోని వ్యాధికారక సూక్ష జీవులను నశింపజేసి మొక్కలకు రక్షణ కల్పిస్తాయన్నారుఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు, రైతు సోదరులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## నంద్యాల క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చి రాణించాలి

**నంద్యాల ప్రతిభ గల క్రీడాకారులకు అన్ని విధాలుగా అండగా నేనుంటా - ఎన్ఎండి ఫిరోజ్**

**నంద్యాల సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్):** నంద్యాల పట్టణంలోని నూనెపల్లె మున్సిపల్ హై స్కూల్ గ్రౌండ్ నందు మండల స్థాయి ప్రభుత్వ పాఠశాల క్రీడాకారుల ఎంపిక పోటీలకు ముఖ్య అతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ విచ్చేశారు అక్కడికి చేరుకున్న ఫిరోజ్ క్రీడాకారులు, పాఠశాల అధ్యాపకులు, పీఈటి మాస్టర్లు ఘనస్వాగతం పలికారు.

ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడాల్లో ప్రావీణ్యం సాధించాలని కోరారు. క్రీడాకారులందరూ ఉత్తమ ప్రతిభ కనబర్చి నంద్యాలకు మంచిపేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఎన్నో ప్రయివేట్ పాఠశాలలకు లేని విశాలమైన క్రీడా గ్రౌండ్ సౌకర్యం పట్టణ నడిబొడ్డులో మన నంద్యాల ప్రభుత్వ పాఠశాలలకు ఉందని వీటిని సక్రమంగా వినియోగించుకుంటే మంచి క్రీడాకారులు నంద్యాల నుండి వస్తారని తెలిపారు. ప్రతిభ కల్గిన క్రీడాకారులను తాను అన్నివిధాలుగా తోడు ఉంటానని ఈ సందర్భంగా తెలిపారు.. అనంతరం క్రీడాపోటిలను ప్రారంభించి క్రీడాకారులతో ఆప్యాయంగా మాట్లాడి వారికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ పీడీ , మున్సిపల్ హై స్కూల్ హెడ్మాస్టర్ చలపతి , జనరల్ సెక్రటరీ శివప్రసాద్ , 19 వ వార్డు టిడిపి ఇన్చార్జి మున్నా , చలం బాబు , బింగుమల్లే



శ్యాంసుందర్ లాల్ , వడ్డె జనార్ధన్ , సుధాకర్ , ఇసుక చాంద్ , దీపక్ రెడ్డి , 15 వార్డు నాగేశ్వరరావు , బాలహోజీ , రాజా , కాజా శంకర్ , సురేష్ చౌదరి , సుబ్బయ్య , హుస్సేన్ , పీఈటీ మాస్టర్లు క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.


## ఏపీలో హైడ్రా తీసుకువచ్చి అక్రమ నిర్మాణాలను తొలగిస్తాం: మంత్రి

**గుంటూరు జిల్లా:** తెలంగాణ రాష్ట్రం తరహాలో ఏపీలో కూడా హైడ్రాను తీసుకువస్తామని ఏపీ గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రకటించారు. ఏపీలో కూడా చాలా అక్రమ నిర్మాణాలు ఉన్నాయని ఆరోపించారు. ఇవాళ(గురువారం) ఏపీ సచివాలయంలో మీడియాతో మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ... త్వరలోనే ఏపీలో కూడా హైడ్రా తరహాలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తామని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు.

వైసీపీ హయాంలో పనిచేసిన ప్రజాప్రతినిధులే చాలా అక్రమ నిర్మాణాలు చేపట్టారని ఆరోపణలు చేశారు. వాటిపై కూడా ప్రత్యేక దృష్టి సారించి కూల్చివేతలకు చర్యలు తీసుకుంటామని మంత్రి కొలుసు పార్థసారథి హెచ్చరించారు. జర్నలిస్టుల సమస్యలపై త్వరలోనే యూనియన్ నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి కొలుసు పార్థసారథి హామీ ఇచ్చారు.

విజయవాడ: బుడమేరు అక్రమణలపై చర్యలు తీసుకుంటున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. బుడమేరు ప్రహహించే చుట్టుపక్కల ప్రాంతాల్లో 3051 ఆక్రమ నిర్మాణాలు చేపట్టారని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. చాలా వరకూ విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆక్రమణలకు గురయ్యాయని చెప్పారు. ఈరోజు ఏపీ సచివాలయంలో మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ... వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఓల్డ్ ఛానల్ వైపు బుడమేరు వెళ్తుందని అన్నారు. ఇది వెలగలేరు, కౌలూరు, ఇలప్రోలు, పైడూరిపాడు, గొల్లపూడి, విద్యాధరపురం, విజయవాడ 14, 15, 16 రెవెన్యూ వార్డులు, గుణదల, రామవరపాడు, ప్రసాదంపాడు మీదుగా ఎనికేపాడు వరకు మొతం 36.2 కిలో మీటర్ల వార్డులు ఉన్నాయని చెప్పారు. అలాగే కొన్ని గ్రామాల్లో కూడా బుడమేరు ఆక్రమణలు ఉన్నాయని మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు.

ఈ ఆక్రమణల్లో చాలా వరకూ అగ్రికల్చర్ కోసం జరిగినవేనని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. వీఎంసీ పరిధిలో 202 ఎకరాల్లో 70 ఎకరాలు ఆక్రమణలకు గురైనట్లు గుర్తించామని అన్నారు. బుడమేరు విస్తారణ నేపథ్యంలో ఎంతమేరకు ఆక్రమణలు జరిగాయనేది ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. చీమల వాగు, కేసరపల్లి, ఎనికేపాడు యూటీల సామర్థ్యాన్ని పెంచాలని నిర్ణయించామని మంత్రి నిమ్మల రామానాయుడు వెల్లడించారు.




ఎనికేపాడు నుంచి కొల్లేరు వరకూ గండ్లను పూడ్చాలని నిర్ణయం తీసుకున్నామని అన్నారు. బుడమేరు ఓల్డ్ ఛానల్ విజయవాడ నగరం మధ్య నుంచి వస్తోందని అన్నారు. దీనికి సమాంతరంగా ఉన్న కెనాల్‌ను విస్తరించడం ద్వారా బుడమేరు ఫ్లడ్ వాటర్‌ను డైవర్ట్ చేయడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. పాములు కాలవ, ముస్తాబాద్ కెనాళ్ల పరిధి పెంచుతామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.


## వరద బాధితుల కోసం విరాళం



**ఆత్మకూరు, సెప్టెంబర్ 19, రిపబ్లిక్ న్యూస్ ::**
విజయవాడ వరద ముంపు బాధితుల కోసం శ్రీశైలం నియోజకవర్గం నుండి అక్షరాల రెండు కోట్ల 20 లక్షల 70 వేల 749 రూపాయలను సీఎం చంద్రబాబుకు గురువారం అందజేసిన శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం రాష్ట్రంలో విజయవాడ కేంద్రంగా వరద రూపంలో భారీ విపత్తు సంభవించడం జరిగిన విషయం విధితమే. వెంటనే స్పందించిన కూటమి ప్రభుత్వం ఎక్కడికక్కడ ఎప్పటికప్పుడు అవసరమైన చర్యలు తీసుకుని వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించి వారికి అవసరమైన ఆహారం తదితరాలన్నీ చూసుకుంటూ పునర్ నివాసం ఏర్పాటు చేయడం అలాగే వరద బాధితుల జీవితం యధాస్థితికి వచ్చేంతవరకు అలుపెరుగని పోరాటం చేస్తూ ముందుకు సాగడం జరుగుతున్నది. ప్రజలు కష్టాల్లో ఉన్నప్పుడు తనవంతుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సహాయ నిధికి ముందుగా విరాళంగా ప్రకటించడం అలవాటు. స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు అందజేయాలని కోరడంతో ఇప్పటికే వెలువలా విరాళాలు ముఖ్యమంత్రి సహాయనిధికి వచ్చి పడడం జరిగింది. అయినప్పటికిని ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహాయంగా ప్రకటిస్తూ ఉండడంతో శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి తను స్వచ్ఛందంగా విరాళం ప్రకటించడమే కాకుండా నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరు తమ వంతు విరాళాలు అందించాలని స్వయంగా విరాళాలు సేకరించడం అందులో భాగంగా నియోజకవర్గ స్థాయిలో మండల స్థాయిలో గ్రామస్థాయిలో కూడా నాయకులను ప్రోత్సహించడంతో ఎప్పుడూ ఎక్కడా కనివిని ఎరగని రీతిలో నియోజకవర్గము నుండి విజయవాడ వరద ముంపు బాధితుల సహాయార్థం రెండు కోట్ల 22 లక్షల 70,749 రూపాయలు సమకూరడం జరిగింది. సహాయనిధికి విరాళాన్ని జిల్లా మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, ఎన్ఎండి ఫరూక్, శ్రీశైలం నియోజకవర్గ ముఖ్య నాయకులతో కలిసి వెళ్లి పార్టీ కార్యాలయంలో అందజేయడం జరిగింది. అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు శ్రీశైలం భ్రమరాంబ మల్లికార్జున స్వామి ప్రసాదాలను, చిత్రపటాన్ని అందజేసి దృశ్యాలువాతో సన్మానించి, నియోజకవర్గ అభివృద్ధి కొరకు కొన్ని ప్రతిపాదనలు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకు వెళ్లడం జరిగింది. స్పందించిన ముఖ్యమంత్రి




కూటమి ప్రభుత్వం అభివృద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతుందని నియోజకవర్గానికి కావాల్సినంత నిధులు మంజూరు చేస్తానని హామీ ఇవ్వడం జరిగిందని తెలిపిన శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి ఎన్ఎండి ఫరూక్లతో పాటు శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, నియోజకవర్గ ముఖ్య నాయకులు బన్నూరు రామలింగారెడ్డి, శేషి రెడ్డి, నరసింహారెడ్డి బొల్లవరం మల్లేశ్వర్ రెడ్డి లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## ఖరీఫ్ సీజన్లో ధాన్యం సేకరణకు ఏర్పాట్లు



**జంగారెడ్డిగూడెం, సెప్టెంబరు** ఖరీఫ్ సీజన్‌లో ధాన్యం సేకరణకు ఏర్పాట్లు చేశామని జేసీ పి.ధాత్రి రెడ్డి తెలిపారు. కేతవరం రైతు సేవా కేంద్రం, పట్టణంలోని రైస్ మిల్లు, ఎంఎల్ఎస్ పాయింట్‌ను జేసీ బుధవారం తనిఖీ చేశారు. గోనె సంచులు నిల్వ చేసేందుకు గోడౌన్‌లను సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు. ఎంఎల్ఎస్ పాయింట్‌లో ప్రస్తుత నిల్వల వివరాలను పరిశీలించారు. జేసీతో పాటు ఆర్డీవో కె.అద్దయ్య, సివిల్ సప్లైస్ జిల్లా మేనేజరు మంజు భార్గవి, డీఎస్‌వో ఆర్ఎస్ఎస్.రాజు, తహసీల్దారు కె.స్లీవజోజి, ఏవో పోశారావు, సీఎస్ డీటీ వైవి.లక్ష్మీకుమారి, తదితరులు పాల్గొన్నారు.

**పోలవరం:** మండలంలో కొత్త పట్టిసీమ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జేసీ పి ధాత్రిరెడ్డి తనిఖీ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రానికి అవసమైన పరికరాలపై సిబ్బందిని ఆరా తీశారు. గోనె సంచుల సమస్య, మిల్లు మ్యాపింగ్, గ్యారెంటీలు, టార్గెట్లు, రవాణా సౌకర్యాల ఇబ్బందులు లేకుండా ధాన్యం కొనుగోలు జరిగేలా చూస్తామని రైతులకు హామీ ఇచ్చారు. కొత్తపట్టిసీమ సొసైటీలో గోనె సంచులు పరిశీలించారు. తహసీల్దారు రాజు, ఏవో కె.రాంబాబు, వీఆర్వోలు పాల్గొన్నారు.

## మసీదులకు మైక్ సెట్లు , ముసలాల్లు (కార్పెట్) పంపిణీ చేసిన మంత్రి ఎన్ఎండి ఫరూక్

**అమరావతి సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్):** విజయవాడ వరద ప్రాంతంలో నష్టపోయిన మసీదులకు అంజుమన్ అహలే ఇస్లాం పొద్దుటూరు కడప జిల్లా , కర్నూల్ ముస్లిం సోదరులు,జహీర్ అలీ ఖాన్ ఆధ్వర్యంలో మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి సహకారంతో మసీదులకు మైక్ సెట్లు , ముసలాల్లు (కార్పెట్) పంపిణీ చేసిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మైనార్టీ మరియు న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ విజయవాడ వరద ప్రాంతంలో పరామర్శించే ప్రక్రియలో భాగంగా వరద ప్రభావిత ప్రాంతాలలో సందర్శించినప్పుడు మసీదులోకి వెళ్లడం జరిగింది ఆ సందర్భంలో మసీదులు పూర్తిగా వాటర్ లో మునిగిపోయి నీటి మోటార్లు , మైక్ సెట్లు , స్పీకర్లు , జానిమాజ్ అన్ని మునిగిపోయి ఒక్క మసీదుకు లక్ష నుంచి రెండు లక్షల నష్టం వాటిల్లినట్టు గుర్తించడం జరిగింది ఈ అంశాన్ని మంత్రిగారు ప్రభుత్వం దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగింది . అయితే ప్రభుత్వం దగ్గర ఉన్న నిధుల సమస్యను గుర్తించి అన్ని ప్రభుత్వ చేయాలంటే సాధ్యం కాదని తన వంతు కర్తవ్యాన్ని ప్రతి ఒక్కరు నిర్వహించాలనే ఉద్దేశంతో . అలాగే రాయలసీమ ప్రాంతంలో ముస్లిం అధికంగా ఉన్నందున కొంతమంది ముఖ్య నాయకులతో మాట్లాడి వెంటనే వాటికి మరమ్మతులు చేపిస్తే బాగుంటుందని బోర్డు సీఈఓ నివేదికను కోరగా దాదాపు 60 మసీదులలో వరద ప్రభావానికి దెబ్బతిన్నట్టుగా తెలియజేయడం జరిగింది . ఈ 60 మసీదులకు తక్షణసాయంగా పొద్దుటూరు కర్నూలుకు చెందిన ముస్లిం సోదరులు మొదటి విడతగా నష్టపోయిన 60 మసీదులకు మైక్ సెట్లు ఇవ్వడానికి ముందుకొచ్చారని వారికి మంత్రి ఫరూక్ కృతజ్ఞతలు తెలియజేశారు . వారి ఆధ్వర్యంలో తొమ్మిది లక్షల ఖర్చుతో కూడిన 60 మైక్ సెట్ లను అంపలిఫైర్స్ , 13 లక్షల ఖర్చుతో కూడిన జానిమాజ్ (ప్రేయర్ మాట్స్) లను డిస్టిబ్యూషన్ చేయడం జరిగింది . అలాగే ప్రభుత్వమే కాకుండా ప్రజలు కూడా ముందుకు వచ్చి విజయవాడ వరద బాధితులను ఆదుకోవాలని మంత్రి ఫరూక్ పిలుపునిచ్చారు . ఈ కార్యక్రమంలో ఏం ఏస్ బేగ్ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, అబ్దుల్ రజాక్ టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, మౌలానా హుస్సేన్ మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఇస్మాయిల్ ఖురేషి, తౌహిద్ అంజుమ్, నాదిర్ బాషా, మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫారూఖ్ షిబ్లీ తదితరులు పాల్గొన్నారు



## సీఎం సహాయనిధికి రూ. 2.50 లక్షలు అందించిన శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థలు



**నంద్యాల సెప్టెంబర్ 19 (రిపబ్లిక్ న్యూస్):** విజయవాడలో వరద బాధితుల సహాయార్థం నంద్యాల పట్టణం చెందిన శ్రీ గురు రాఘవేంద్ర, శ్రీ గురురాజా ఇంగ్లీష్ మీడియం సంయుక్తంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 2.50 లక్షల చెక్కును అందజేశారు. విజయవాడలోని సీఎం చంద్రబాబు నాయుడు కార్యాలయంలో శ్రీ గురు రాఘవేంద్ర విద్యా సంస్థల డైరెక్టర్ పి.మౌలాలి రెడ్డి సీఎం చంద్రబాబు నాయుడుని కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును అందజేశారు. విజయవాడ వరద బాధితుల సహాయంగా రూ. 2.50 లక్షల చెక్ అందజేసిన విద్యా సంస్థల డైరెక్టర్ మౌలాలి రెడ్డిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రత్యేకంగా అభినందించారు. అలాగే వరద బాధితుల కోసం శ్రీ గురు రాఘవేంద్ర విద్యాసంస్థలు బియ్యం పంపిణీ చేయడంపై విద్యాసంస్థల అధినేత డాక్టర్ పి. దస్తగిరి రెడ్డి, డైరెక్టర్లు పి. మౌలాలి రెడ్డి, పి. షేక్షావలి రెడ్డిలను అభినందించారు.

## ఆళ్లగడ్డలో స్కూల్ గేమ్స్ ప్రారంభించిన ఎం.ఈ.ఓ




**ఆళ్లగడ్డ ప్రజా రిపబ్లిక్ న్యూస్:** ఆళ్లగడ్డ పట్టణంలోని వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం ఆళ్లగడ్డ మండల స్కూల్ గేమ్స్ టోర్నమెంట్స్ ను మండల విద్యాశాఖ అధికారి శోభా వివేకావతి వైపిపిఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీర రాఘవయ్య తో పాటు కలిసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వీరరాఘవయ్య మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ పోటీలలో పాల్గొనే క్రీడాకారులు అందరికీ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి సంవత్సరంలాగే ఈ ఏడాది కూడా మండల స్థాయిలో స్కూల్ గేమ్స్ నిర్వహించి ఇక్కడ ఎంపికైన వారికి వివిధ స్థాయిలలో పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండల స్కూల్ గేమ్స్ కో-ఆర్డినేటర్ పి ప్రభాకర్, నియోజకవర్గ కోఆర్డినేటర్ సి. నాగేంద్ర, వ్యాయామ ఉపాధ్యాయులు అందరూ పాల్గొని ఈ టోర్నమెంట్ ను విజయవంతంగా ప్రారంభించారు.

# బండి ఆత్మకూరు మండల ప్రజల దాతృత్వం

### రూ 37.28 లక్షల వరద సాయం లక్షలు ఎమ్మెల్యే బుడ్డాతో కలిసి సీఎం చంద్రబాబుకు చెక్కు అందించిన టిడిపి నాయకులు

**బండి ఆత్మకూరు, సెప్టెంబర్ 19,( రిపబ్లిక్ న్యూస్):-** బుడమేరు వరద విపత్తులో సర్వం కోల్పోయిన విజయవాడ వాసులకు బండి ఆత్మకూరు మండల ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించి అండగా నిలిచారు. మండల వ్యాప్తంగా సుమారు రూ 38.28 792 లక్షల రూపాయలను సీఎం రిలీఫ్ ఫండ్ కు విరాళంగా అందించి మండల ప్రజలు వారి దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇందులో భాగంగా గురువారం శ్రీశైలం నియోజకవర్గ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి బండి ఆత్మకూరు టిడిపి మండల ఇన్చార్జి నందిపాటి నరసింహారెడ్డి,శ్రీశైలం నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు బొల్లవరం మల్లేశ్వర రెడ్డి,జి.సి పాలెం ఉపసర్పంచ్,టిడిపి క్లస్టర్ ఇంచార్జి కంచర్ల చిన్న లింగారెడ్డిలతో కలిసి రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు చెక్కు అందజేశారు.కాగా మండలంలోని కాకునూరు గ్రామానికి చెందిన దేరెడ్డి పరమేశ్వరారెడ్డి రూ.5 లక్షలు, మండలంలోని పొదుపు మహిళలు రూ.5 లక్షలు భారీ సాయం అందించారు.వీరితో పాటు మండలంలోనీ అన్ని గ్రామాల టిడిపి ముఖ్య నాయకులు వారి స్థాయిలో విరాళం అందించారు. అంతేకాకుండా ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి వరద సాయం అందించడం సంతోషకరమని టిడిపి నాయకులు అన్నారు.సాయం




అందించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపినట్లు టిడిపి నాయకులు తెలిపారు. కాదా శ్రీశైలం నియోజకవర్గం మొత్తంగా ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి రూ 2,22,70,749 కోట్ల రూపాయల చెక్కును ముఖ్యమంత్రికి అందజేసినట్లు టిడిపి కార్యాలయం ప్రకటించింది.

# స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్రణాళిక రూపొందించండి



**నంద్యాల, సెప్టెంబర్ 19, రిపబ్లిక్ న్యూస్ :** కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వికసిత్ భారత్ 2047లో భాగంగా అభివద్ధి చెందిన ఆంధ్రప్రదేశ్ గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దే లక్ష్యంతో స్వర్ణాంధ్ర ఏ2047 విజన్ డాక్యుమెంట్ ను రూపొందించి నవంబరు 1వ తేదీన ఆవిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ వెల్లడించారు. స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనకు తీసుకోవాల్సిన చర్యలపై గురువారం రాష్ట్ర సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లు, వివిధ శాఖాధిపతులు, కార్యదర్శులతో వీడియో సమావేశం నిర్వహించారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా, జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, సీపీఓ వేణుగోపాల్, ఇతర జిల్లాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ మాట్లాడుతూ ఏడాదికి 15శాతం వృద్ధి రేటు సాధనే లక్ష్యంగా స్వర్ణాంధ్ర ఏ2047 విజన్ ప్రణాళికను రూపొందిస్తున్నట్టు తెలిపారు. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధి చెందిన రాష్ట్రంగా తీర్చిద్దడంతో పాటు 43 వేల డాలర్లకు పైగా తలసరి ఆదాయంతో కూడిన 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ గల రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దే లక్ష్యంతో ఈవిజన్ డాక్యుమెంట్ ను రూపొందిస్తున్నట్టు సిఎస్ పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ ప్రాధాన్యాలైన జీరో పేదరికం, ఈజ్ ఆఫ్ లివింగ్, సామాజిక మౌలిక సదుపాయాల అభివృద్ధి, డెమోగ్రాఫిక్ మేనేజిమెంట్, డేటా సెంటర్, ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్సు వంటి గ్రోత్ వంటి జిల్లాలో ప్రాముఖ్యం కలిగిన అంశాలను దృష్టిలో ఉంచుకుని ఐదేళ్ళ విజన్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్లకు స్పష్టం చేశారు. జిల్లా ప్రణాళిక ఆధారంగా చేసుకుని మండల స్థాయిలో ఐదేళ్ళ విజన్ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయాలని చెప్పారు. అదే విధంగా ఈనెల 21 నుండి అక్టోబరు 5లోగా స్వర్ణాంధ్ర ఏ 2047పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు మండల,మున్సిపల్,గ్రామ పంచాయితీ స్థాయిల్లో అవగాహనా సదస్సులను నిర్వహించడం జరుగుతుందని సిఎస్ వెల్లడించారు. జిల్లా కలక్టర్ల స్థాయిలో రైతులు, ప్రముఖ వ్యక్తులు, ఇతర ప్రముఖ సంఘాల ప్రతినిధులతో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలన్నారు. జిల్లా స్థాయిలో




ఎంపి, ఎంఎల్ఏ, ఎంఎల్సి తదితర ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్లను సిఎస్ సూచించారు. స్వర్ణాంధ్ర ఏ2047పై విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 21 నుండి అక్టోబరు 5వ తేదీల మధ్య వివిధ పాఠశాలల,కళాశాలల విద్యార్థిణీ విద్యార్థులకు వ్యాస రచన,వ్యకృత్వ తదితర పోటీలను నిర్వహించాలని జిల్లా కలక్టర్లకు సిఎస్ స్పష్టం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ స్వర్ణాంధ్ర ఏ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పనలో భాగంగా అన్ని శాఖల నుండి ప్రణాళికలు తెప్పించుకోవాలని సిపిఓ ను ఆదేశించారు. సెప్టెంబరు 30 నాటికి మండల వారీ ప్రణాళికలు, అక్టోబరు 15లోగా జిల్లా ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు.

## అభయహస్తం నిధులను వైసీపీ కాజేసింది



**అమరావతి:** సామాజిక పెన్షన్ల అర్హత నిర్ధారణ అంశంపై త్వరలోనే కేబినెట్ సబ్ కమిటీ సమావేశం ఏర్పాటవుతుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. కొందరు అనర్హులు పెన్షన్లు తీసుకుంటున్నారని అన్నారు. ఈరోజు(గురువారం) ఏపీ సచివాలయంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడుతూ... బైక్‌లు నడుపుతున్న కొంతమంది రూ.15 వేల వికలాంగ పెన్షన్ తీసుకుంటున్నారని చెప్పారు. డ్వాక్రా సంఘాలను మైక్రో పారిశ్రామికవేత్తలుగా మారుస్తామని మాటిచ్చారు. మహిళా పారిశ్రామిక వేత్తలను ప్రోత్సహిస్తామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.

డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అమరావతిలో డ్వాక్రా మహిళల ఉత్పత్తుల ఎగ్జిబిషన్ కోసం 10 ఎకరాలు ఇచ్చేందుకు సీఎం చంద్రబాబు అంగీకరించారని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వం రూ.2100 కోట్ల అభయహస్తం నిధులను కాజేసిందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆరోపించారు.

జగన్ ప్రభుత్వం స్త్రీనిధి బ్యాంక్‌ను అప్పుల్లో ముంచిందని విమర్శలు చేశారు. గత ప్రభుత్వం డ్వాక్రా సంఘాలకు చెందిన రూ.950 కోట్ల స్త్రీనిధిని పీడీ ఖాతాలకు మళ్లించిందని ఆరోపించారు. ఈ వ్యవహారాలపై విచారణ చేయించాలని నిర్ణయం తీసుకున్నామని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పష్టం చేశారు.

# ఏపీకి తిరిగి ఊపిరి పోసిన కూటమి పాలన

### ఐదేళ్ల వైసీపీ అరాచకం నుంచి.. రూ.5కే కడుపు నింపే స్థితికి “ఇది మంచి ప్రభుత్వం” నినాదంతో వంద రోజుల్లో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలపై ప్రచారం

### ఈ నెల 20 నుంచి “ఇది మంచి ప్రభుత్వం” నినాదంతో ఆరు రోజులపాటు ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని కలుస్తాం

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ , మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్

**నంద్యాల సెప్టెంబర్ 19 ( రిపబ్లిక్ న్యూస్): :** రాష్ట్రంలో ఎన్డీయే అధికారంలోకి వచ్చి వంద రోజుల వుతున్న సందర్భంగా ఈ నెల 20 నుంచి ఇది మంచి ప్రభుత్వం నినాదంతో మంత్రులు, ఎమ్మెల్యేలు ఆరు రోజులపాటు ఇంటింటికీ వెళ్లి ప్రజల్ని కలవనున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.

ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ చంద్రబాబు సారథ్యంలోని ఎన్డీయే ప్రభుత్వం తొలి వందరోజుల్లో అమలు చేసిన సంక్షేమ పథకాన్ని, చేపట్టిన




ముఖ్యమైన కార్యక్రమాల్ని వారికి వివరిస్తామన్నారు. ఆరు ముఖ్యమైన అంశాలతో కరపత్రాన్ని రూపొందించారని, ప్రభుత్వ లోగోతోనే కరపత్రాన్ని సిద్ధం చేశారన్నారు.

“సంక్షోభంలోనూ సంక్షేమం సాధించి, అభివృద్ధికి రెక్కలు తొడిగి, మొదటి వంద రోజుల్లోనే ‘ఇది మంచి ప్రభుత్వం’ అని ప్రజల చేత అనిపించుకుంటోంది కూటమి ప్రభుత్వం” అని పేర్కొన్నారు.

**ప్రస్తావించిన ఆరు ముఖ్యాంశాలు**

16,437 పోస్టుల భర్తీకి మెగా డీఎస్సీ ప్రకటించడం ద్వారా నిరుద్యోగ యువతకు అండ

పింఛను మొత్తాన్ని ఒకేసారి రూ.1000 పెంచి... రూ.4వేలు చేయడంతో పాటు, ఎన్డీయే అధికారంలోకి వచ్చిన మొదటి నెలలో ఒక్కొక్కరికీ రూ.7 వేల చొప్పున అందజేశాం. ఒకేరోజు 65.18 లక్షల మందికి ఇంటింటికీ వెళ్లి రూ.4,408 కోట్లు పంపిణీ చేశాం. దేశంలోనే ఇదో తిరుగులేని సంక్షేమ చరిత్ర.

ప్రతినెలా ఒకటో తేదీనే ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నాం. ధాన్యం కొనుగోలు బకాయిలు రూ.1,674.47 కోట్లు చెల్లించి అన్నదాతను ఆదుకున్నాం. స్థానిక సంస్థలకు రూ.1,452 కోట్లు ఇచ్చి పంచాయతీలకు ప్రాణం పోశాం.

పేదలకు పూటకు రూ.5కే ఆకలి తీర్చే 100 అన్నక్యాంటీన్లను పునఃప్రారంభించాం.

‘ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ను రద్దుచేసి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాం.

విజయవాడ నగరం వరదల్లో విలవిల్లాడుతున్నప్పుడు చంద్రబాబు పది రోజులపాటు బస్సులోనే ఉంటూ, నిద్రాహారాలు మాని ప్రజల్ని ఓ తండ్రిలా కాపాడారు.

తాను పది రోజులు బస్సులోనే పడుకొని పనిచేసి ఆదర్శంగా నిలిచారు. ఆయన శ్రమ రాష్ట్రం లోపలా,బయటా అన్ని వర్గాల ప్రజల ప్రశంసలు పొందిందని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వివరించారు.

## కొత్త రేషన్ కార్డులపై సీఎం రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన

**హైదరాబాద్:** త్వరలోనే కొత్త తెల్ల రేషన్ కార్డుల జారీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. రేషన్ కార్డులు పొందేందేకు అర్హతలున్న ప్రజలు సంవత్సరాల తరబడి నిరీక్షిస్తూనే ఉన్నారు. దాదాపు తొమ్మిది సంవత్సరాలుగా కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ నిలిచిపోగా, బీఆర్ఎస్ హయాంలో రెండున్నర సంవత్స రాల క్రితం మళ్లీ ఆ ప్రస్తావన వచ్చింది. 2021 జూన్‌లో అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటనతో కొత్త కార్డుల ప్రక్రియ తెరపైకి రాగా, అర్హతగల వారి నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించారు. రెండున్నరేళ్లు గడిచినా తిరిగి కొత్త కార్డుల ఊసే ఎత్తకపోవడంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

కొత్త రేషన్ కార్డులపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. ఈరోజు(గురువారం) తెలంగాణ సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో పలు కీలక సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రేషన్ కార్డుల జారీకి విధివిధానాలు త్వరగా రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. అక్టోబరు 2 నుంచి దరఖాస్తులు స్వీకరించాలని సీఎం రేవంత్ సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి డిజిటల్ రేషన్ కార్డులు ఇచ్చేందుకు కసరత్తు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనతో తెలంగాణలో దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, అర్హతగల వారికి త్వరలో కొత్త రేషన్ కార్డుల జారీకి మోక్షం కలగనుంది. ప్రజలకు కొత్త రేషన్ కార్డులు అందజేసే క్రమంలో విధివిధానాలను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సబ్ కమిటీని నియమించిన విషయం తెలిసిందే.

ఈ మేరకు కొత్త రేషన్ కార్డుల జారీ కోసం క్యాబినెట్ స్థాయిలో సబ్ కమిటీని ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర పౌర సరఫరాలశాఖ మం త్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చైర్మన్‌గా వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను సభ్యులుగా నియమిస్తూ ఆదేశాలు జారీ చేసింది. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం అవసరమైన విధి విధానాలను రూపొందించి సబ్ కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేయనుంది. సబ్ కమిటీ సిఫార్సు మేరకు రేషన్ కార్డుల జారీ విషయమై రేవంత్ ప్రభుత్వం తుది నిర్ణయం తీసుకోనుంది.



ఆరోగ్య శ్రీ ప్రయోజనం కోసం కొందరు తెల్లకార్డులు తీసుకుంటుండటంతో....ప్రజా పంపిణీ వ్యవస్థకు, ఆరోగ్య శ్రీ పథకానికి వేర్వేరుగా తెల్లరేషన్ కార్డులు అందజేసేలా చర్యలు చేపట్టనున్నట్లు ఇటీవల సమావేశమైన సబ్ కమిటీ పేర్కొంది. కొత్త రేషన్ కార్డుల జారీ కోసం పట్టణాల్లో రూ. 2 లక్షల్లోపు, గ్రామాల్లో రూ. లక్షన్నర వార్షికాదాయం లేదా మాగాణి 3.50 ఎకరాలు లేదా చెల్క 7.5 ఎకరాల్లోపు ఉన్నవారికే తెల్ల కార్డులు ఇవ్వాలని ప్రతిపాదించింది. మరోవైపు దారిద్ర్య రేఖకు దిగువన (బీపీఎల్) ఉన్నవారు ఎవరూ తెల్లకార్డు అవకాశం కోల్పోకుండా అవసరమైన చర్యలు చేపట్టేందుకు ప్రభుత్వం సన్నద్ధం అవుతోంది. ప్రభుత్వ నిర్ణయంతో దరఖాస్తు చేసుకున్న వారిలో ఆనందం వెల్లివిరుస్తోంది.

printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501
EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com